సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 10 । నవంబర్ । 2024



ఎక్కడి పనులు అక్కడే

బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు ఆగిపోయాయి. మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



స్టేట్‌మీట్ ప్రారంభం

స్కూల్‌గేమ్స్ స్టేట్‌మీట్ ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. - 8లో

14న జిల్లా అండర్-12 క్రికెట్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీల్లో పాల్గొనే జిల్లా అండర్-12 బాలుర జట్టు ఎంపికలను ఈ నెల 14న నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలల క్రికెట్ నెట్స్‌లో గురువారం ఉదయం 8.30 గంటలకు ఎంపికల ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పానమట్టాలపై దీపాలు నిషేధం



పానమట్టం మీద దీపాలు లేకుండా పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి ఎఫెక్ట్...

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోగల అష్ట దిక్పాలకులు, అష్ట గణపతులు, వివిధ దేవతామూర్తుల విగ్రహాల వద్ద, శివలింగాల పానమట్టాలు మీద దీపాలు పెట్టడం నిషేధించామని కేంద్ర పురావస్తుశాఖ కన్జర్వేటివ్ అసిస్టెంట్ నవీన్ శనివారం తెలిపారు. 'ముక్కంటీ.. నీవే దిక్కంటీ' అన్న శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం సిబ్బందితో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవగాహన కల్పించారు. అత్యంత విశిష్టమైన, పురాతనమైన ఈ దేవతా విగ్రహాలు జాతి వారసత్వ సంపద అని వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులతోపాటు దేవదాయ శాఖ అధికారులు, అర్చకులు, భక్తులపై ఉందన్నారు. అలాగే రసాయనాలు కలిసిన పాలు, పసుపు, కుంకుమలు విగ్రహాలపై వేస్తే వాటి యథారూపం కోల్పోతుందన్నారు. విగ్రహాల తేజస్సు పాడు చేయకుండా పూజలు చేసుకోవచ్చని అన్నారు. దీపాలు కూడా అతి దగ్గరగా పెట్టకుండా దూరం పాటించాలని సూచించారు.

పెద్దతుంగాంలో ఎలుగుబంటి హల్‌చల్



గ్రామంలో పిల్లలను పట్టుకుని తిరుగుతున్న ఎలుగుబంటి

సంతబొమ్మాళి: మండలం పెద్ద తుంగాం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎలుగుబంటి తన పిల్లలతో గ్రామంలో హల్‌చల్ చేసింది. గ్రామంలో ఎవరికి ఏమీ హాని తలపెట్టకుండా కొద్దిసేపు అటుఇటు తిరిగి పాఠశాల పక్క నుంచి పంట పొలాల వైపు వెళ్లిపోయింది. దీన్ని స్థానికులు కొందరు సెల్‌లో ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

భయం గుప్పెట్లో సరిహద్దు గ్రామాలు



బాలాకుమారీ కొండ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు పెద్ద పులి అలికిడితో భయం గుప్పెట్లో క్షణక్షణం భయం భయంగా గడుపుతున్నారు. శుక్రవారం రాత్రి చీకటి ప్రాంతం ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న బాలా కుమారీ కొండ, రాంపూర్ గ్రామ పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి అడుగులను ఒడిశా అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో కాశీబుగ్గ రేంజ్ ఫారెస్ట్ అధికారులు స్పందించి ఆంధ్రా ప్రాంతంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పెద్ద పులి దాడిలో యువకుడు గాయాలు పాలైనట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న వీడియోలు ప్రస్తుతం హల్‌చల్ చేస్తుండటంతో సరిహద్దు గ్రామ ఆంధ్రా ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

యంత్రాలతో సుస్థిర సేద్యం



రాగోలు క్షేత్రంలో పండించిన వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం రూరల్: రైతులు యంత్రాలు వినియోగిస్తే సేద్యం లాభసాటిగా మారుతుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉత్తర కోస్తాకు అనువైన లాభసాటి వ్యవసాయ విధానాలు అనే అంశంపై ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన స్థానం రాగోలు, జిల్లా వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహించిన కిసాన్‌మేళాను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. మార్టేరును తలదన్నేలా రాగోలు పరిశోధన స్థానాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రతి వారంలో రెండు రోజులు వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, అధికారులు రైతులు దగ్గరికి వెళ్లి మాట్లాడాలని సూచించారు. సబ్సిడీపై యంత్రాలు, డ్రోన్లను అందిస్తామని అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు డ్రోన్ సాంకేతికతను అందుబాటులో ఉంచామని తెలిపారు.

SUNDAY SPECIAL

ఖండాంతరాల్లో ప్రదర్శన..

ప్రతిభకు నిదర్శనం

● యూకేలో 'సంప్రదాయం' నృత్య ప్రదర్శనలు ● ద్రౌపది నృత్యరూపకం, కామసూత్ర బ్యాలేలకు విశేష స్పందన

నిండు సభలో చీర లాగారు.. కళ్లప్పగించి చూసిన ఏ ఒక్కరినీ ఆమె వదల్లేదు. రాజ్యాలు కోల్పోయి, అడవులు పట్టి మారువేషాలు వేసుకుని గడుపుతుంటే.. కీచకుడు కన్ను వేశాడు. అంత దీన పరిస్థితుల్లోనూ ఆమె వెరవలేదు. కీచకుడి చావును కళ్లజూసింది. ఎన్ని కష్టాలు ఎదురైనా మహిళ కుంగిపోకూడదని చెప్పడానికి ద్రౌపది కథ కంటే గొప్ప స్ఫూర్తి ఏముంటుంది. 'సంప్రదాయం' ఆ కథను యూకేకు పరిచయం చేసింది. అంతే కాదు.. బూతుగా మారిపోయిన కామసూత్రం అసలు అర్థాన్ని వివరిస్తూ శరీరం తాదాత్మ్య స్థితికి చేరుకునే ప్రయాణాన్ని ధైర్యంగా వివరించింది. ఈ నృత్య రూపకాలకు ఇంగ్లిష్ జనం బ్రహ్మరథం పట్టారు. రెండు నెలల పాటు జరిగిన యూకే టూర్‌లో ఈ రెండు అంశాలపై వర్క్‌షాపులు కూడా నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్



కామసూత్ర నృత్యరూపకంలో ఓ భంగిమ





విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన సంప్రదాయం టీమ్

శ్రీకాకుళం సంప్రదాయం కూచిపూడి గురుకులం ప్రతినిధులు జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలు దాటించారు. నృత్య కళాశాల డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ ఆధ్వర్యంలో యూకేలో రెండు నెలల పాటు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో ముఖ్యంగా కామసూత్ర, ద్రౌపది నృత్య రూపకాలు అక్కడి వారిని విపరీతంగా ఆకట్టుకున్నాయి. కామసూత్రను అర్ధనారీశ్వరం పేరుతో లండన్, ఐర్లాండ్, స్కాట్లాండ్‌లలో ప్రదర్శించారు. ద్రౌపదిగా స్వాతి సోమనాథ్, జూనియర్ ద్రౌపదిగా యామిని కసిరెడ్డి, అర్జునుడిగా బలరామ్, అంజలి కూడా ప్రదర్శనలో భాగమయ్యారు.

కామసూత్ర..

కామసూత్ర నృత్య రూపకానికి 2003లోనే స్వాతీ సోమనాథ్ కొరియోగ్రఫీ చేశారు. అందులో కొన్ని మార్పులుచేసి యూకేలో తిరిగి ప్రదర్శించారు. కామసూత్ర అంటేనే బూతుగా మారిపోయిన నేటి పరిస్థితుల్లో.. వాత్సాయనుడి అసలు ఉద్దేశాన్ని ఆమె నృత్య రూపంలో వివరించారు. మనిషిలోని ఏడు చక్రాలు, సప్త స్వరాలను అనుసంధానిస్తూ ప్రదర్శన చేశారు. పింగార్ రచయిత, గరిమెళ్ల గోపాలకృష్ణ సంగీతం అందించారు.

ఇదే ద్రౌపది కథ..

ద్రౌపది కథను కూచిపూడి నృత్యశైలిలో వివరిస్తూ స్వాతీ సోమనాథ్ నృత్యరూపకం రూపొందించారు. ద్రౌపది పుట్టుక నుంచి స్వయంవరం వరకు చాలామంది ఇలాంటి బ్యాలేలు నిర్వహించారు. కానీ స్వాతి ప్రదర్శించిన దానిలో ద్రౌపది స్వయంవరం నుంచి మహాప్రస్థానం వరకు వివరించారు. ఒక మహిళకు ప్రతి రోజు ఎదురయ్యే సంఘటనలను ఎదుర్కొని నిలబడాల్సిన వైనాన్ని వివరించారు. ద్రౌపది ధైర్యంగా ఎదుర్కొన్న ఎన్నో కష్టాలను ఈ ప్రదర్శనలో చూపించారు.



ద్రౌపదిగా స్వాతీ సోమనాథ్ హావభావాలు

మంచి పేరు వచ్చింది..

యూకేలో ప్రధానంగా మేము ప్రదర్శించిన రెండు నృత్య రూపకాలకు మంచి పేరు వచ్చింది. ద్రౌపది, కామసూత్ర రూపకాలను ప్రతి ఒక్కరూ మెచ్చుకున్నారు. అయితే ముందులో కామసూత్రపై చాలా మంది లండన్‌లో వ్యతిరేకించినా ప్రదర్శన చూసిన వారు అందరూ అందులో మార్పుల కోసం కొన్ని సూచనలు కూడా చేశారు.

– స్వాతీ సోమనాథ్, డైరెక్టర్, సంప్రదాయం

కూటమి నేతలకు ఆశాభంగం


● నామినేటెడ్‌లో సిక్కోలుకు దక్కని ప్రాధాన్యం
● తాజా ప్రకటనలో టీడీపీకి రాష్ట్ర స్థాయి పదవి
● జనసేనకు జిల్లా స్థాయి
● జనసేన సీనియర్లకు మొండి చేయి
● బీజేపీకి మళ్లీ శూన్యహస్తం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

నామినేటెడ్ పోస్టుల భర్తీ మళ్లీ కూటమి నేతలకు ఆశాభంగం కలిగించింది. ఈ పోస్టుల భర్తీ విషయాన్ని బీజేపీ అధిష్టానం పట్టించుకోవడం లేదు. నామినేటెడ్ పోస్టుల్లో ఆ పార్టీ నేతలకు చోటు దక్కడం లేదు. ఇక నామినేటెడ్ పోస్టులెన్ని ఇచ్చినా పవన్ కల్యాణ్ సంతోషంగానే ఉంటున్నారు. కానీ జనసేన నాయకులు మాత్రం అన్యాయమైపోతున్నారు. అధికారంలోకి వస్తే చివరనున్న సిక్కోలుకే ఎక్కువ పదవులు వస్తాయని టీడీపీ నాయకులు ఆశించారు. పదవులు ప్రకటించేసరికి ఒకటి రెండుకే పరిమితం కావడంతో ఎవరికీ చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. వెరసి కూటమిలోని మూడు పార్టీల నాయకులదీ ఒక్కటే ఆవేదన. కానీ బయటకు చెప్పుకోలేకపోతున్నారు. అసంతృప్తి వ్యక్తం చేద్దామన్నా, అసమ్మతి తెలియజేద్దామన్నా, ఆవేదన వినిపిద్దామన్నా వృథా ప్రయాసే అన్న ఆలోచనతో దిగమింగుతున్నారు.



పదవుల ప్రకటనతో గుబులు



ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం రెండు పర్యాయాలు నామినేటెడ్ పదవులను ప్రకటించింది. మొదట విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 20 కార్పొరేషన్ల చైర్మన్లను ప్రకటించగా అందులో రెండు మాత్రమే మన జిల్లాకు దక్కాయి. ఆ రెండు టీడీపీ ఖాతాలోకి వెళ్లిపోయాయి. జనసేన, బీజేపీలకు గుండు సున్నాయే మిగిలింది. తాజాగా రెండో జాబితా ప్రకటించారు. అందులో ఒకటి టీడీపీకి, మరొకటి జనసేనకు ఇచ్చారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నరసన్నపేటకు చెందిన రోణంకి కృష్ణంనాయుడిని నియమించగా, శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పాతపట్నంకు చెందిన జనసేన నాయకుడు కొరికాల రవికుమార్‌ను నియమించారు. ప్రకటించినదాంట్లో రాష్ట్ర స్థాయి పదవిని టీడీపీకి కట్టబెట్టగా, జిల్లా స్థాయి పదవిని జనసేనకు మిగిల్చారు.

బీజేపీకి జీరో..

బీజేపీ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దేశమంతా చక్రం తిప్పుతున్నా రాష్ట్రంలోనూ అందులో జిల్లాలోనూ తాము మైనార్టీలమేనని బాధపడుతున్న పరిస్థితి నెలకుంది. పదవుల ప్రకటనలో 5శాతం మాత్రమే బీజేపీకి అని చంద్రబాబు ఖరాఖండిగా తేల్చేయడంతో సిక్కోలు జిల్లా నేతలకు కనీసం చోటు దక్కడం లేదు. ఇక్కడ బీజేపీ నాయకులు ఉన్నారన్న విషయాన్ని కూడా విస్మరిస్తున్నారు. బీజేపీలో సీనియర్లుగా ఉన్న పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాల్, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావులకు మొండి చేయి ఎదురైంది. వీరితో పాటు రెండు దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్నా అనేకమందికి కనీసం గుర్తింపు దక్కడం లేదు. లేటుగా వచ్చినా లేటెస్ట్ అని నిరూపించుకుని జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఎదిగిన బిర్లంగి ఉమామహేశ్వరరావును కూడా పట్టించుకోలేదు.

జనసేన నేతలకు దక్కని గుర్తింపు..

నామినేటెడ్ పోస్టులపై కూటమి పార్టీల నాయకులు గంపెడాశలు పెట్టుకున్నారు. మరో రెండున్నరేళ్ల వరకు స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పోస్టులపైనే కన్నేశారు. రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న సిక్కోలు జిల్లాలో అత్యధిక మందికి పదవులు వస్తాయని భావిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాకపోవడంతో తప్పనిసరిగా తమకు ఎక్కువ పదవులు వస్తాయని జనసేన, బీజేపీ నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత పదేళ్లుగా చట్టసభలకు వెళ్దామని కోట్లు ఖర్చు పెట్టినా ఎన్నికల్లో పవన్ కల్యాణ్ కుదుర్చుకున్న పొత్తుతో వారి ఆశలు గల్లంతయ్యాయి. అలాగని, వేరే పార్టీలోకి వెళ్లి పోటీ చేద్దామనుకున్నా అక్కడ అవకాశం లేకపోవడంతో పవన్ కల్యాణ్ నిర్ణయానికి కట్టుబడి నాయకులందరూ పార్టీలోనే ఉన్నారు. అంతేకాకుండా ఇతర పార్టీల్లోని అసంతృప్తులు కూడా ఎన్నికలకు ముందు తమకు పోటీ చేసే అవకాశం వస్తుందని హుటాహుటిన కండువాలు కప్పుకున్నారు. ఇలా జనసేనలోనే చాంతాడంత జాబితా నామినేటెడ్ రేసులో ఉంది. కానీ, చంద్రబాబు ఎన్నికలకు ముందు ఏ రకంగానైతే జనసేనకు సీట్లు ఇచ్చారో ప్రభుత్వం ఏర్పాటయ్యాక నామిటెడ్ పదవుల్లో కూడా అదే నిష్పత్తిలో కేటాయింపులు చేస్తున్నారు. దీంతో జనసేన పాత నాయకులకు పూర్తిగా నిరాశే మిగులుతోంది. తాజాగా ఒకే ఒక జిల్లా స్థాయి పదవిని పాతపట్నంకు చెందిన కొరికాల రవికుమార్‌కు ప్రకటించారు. ఆయన ఎన్నికల ముందు కండువా కప్పుకున్నారు. ఆయనకు ముందు అదే నియోజకవర్గంలో గేదెల చైతన్య ఉన్నారు. వారికి మొండి చేయి ఎదురైంది. వీరికే కాదు పార్టీ కోసం మొదటి నుంచి ఇచ్ఛాపురం నుంచి దాసరి రాజు, పలాస నుంచి డాక్టర్ వి.దుర్గారావు, టెక్కలి నుంచి కణితి కిరణ్, శ్రీకాకుళం నుంచి కోరాడ సర్వేశ్వరరావు, ఎచ్చెర్ల నుంచి విశ్వక్‌సేన్, ఆమదాలవలస నుంచి పేరాడ రామ్మోహనరావులకు అన్యాయం జరిగింది. వీరే కాదు తప్పనిసరిగా ప్రాధాన్యత ఉంటుందని భావించి పార్టీలో చేరిన డాక్టర్ దానేటి శ్రీధర్‌కు, పిసిని చంద్రమోహన్ తదితర నాయకులకు కూడా గుర్తింపు దక్కలేదు. ఒకవైపు ప్రభుత్వంలో గుర్తింపు లేదు. మరోవైపు పార్టీలో గౌరవం దక్కడం లేదు. ఇంకోవైపు టీడీపీ నాయకులు హేళనగా చూస్తున్నారు. బాధను దిగమింగి విలువ లేని చోట ఉండాల్సిన పరిస్థితులను జనసేన నాయకులు ఎదుర్కొంటున్నారు.

మాట్లాడలేని పరిస్థితిలో టీడీపీ..

జనసేన, బీజేపీ నాయకుల పరిస్థితి ఒకలా ఉంటే.. టీడీపీ నాయకులు మింగలేక, కక్కలేక కుమిలిపోతున్నారు. దాదాపు ప్రతీ నియోజకవర్గంలో ఆశావహులు ఉన్నారు. కానీ ఇప్పటివరకు ప్రకటించిన రెండు జాబితాల్లో ముగ్గురికే చోటు దక్కింది. దీంతో తమకు గుర్తింపు దక్కుతుందా? అని ఆందోళన చెందుతున్నారు. ప్రతి దానికి వైఎస్సార్‌సీపీతో పోల్చుకుంటున్న టీడీపీ నాయకులకు నామినేటెడ్ పదవుల ప్రకటనకొచ్చేసరికి ఏం మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మన జిల్లాకు చెందిన బల్లాడ హేమమాలినిరెడ్డి, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పంగ కృష్ణవేణి, చీపురు రాణి, రాజాపు హైమావతి, పేరాడ తిలక్, నర్తు రామారావు, శ్యాంప్రసాద్ రెడ్డి, దుక్క లోకేశ్వరరెడ్డిలకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. సుడా చైర్మన్‌గా కోరాడ ఆశాలతను నియమించారు. ఒక పర్యాయంలో ఇంతమందికి వైఎస్సార్‌సీపీ అవకాశం కల్పించగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకటి రెండు పోస్టుల ప్రకటనతో తుస్సుమంటోంది. ఈ పరిణామాలన్నింటినీ టీడీపీ నాయకులు బేరీజు వేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

ఆటో.. బైక్ ఢీ



ఆకులరఘునాథపురం సమీపంలో బోల్తా పడిన ఆటో

నందిగాం: ఆకులరఘునాథపురం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగోలు దరి గూడేంకు చెందిన ఆటో డ్రైవర్ తన ఆటోలో శ్రీకాకుళం మండలం పాత్రునివలసకు చెందిన ఆరుగురు మహిళలను టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లికార్జునస్వామి దర్శనం కోసం బయల్దేరి టెక్కలి దాటి వెళ్లిపోయారు. మద్దిలివానిపేట దాటేసరికి దారి తప్పిన విషయం గ్రహించి బండి తిప్పడానికి ప్రయత్నించగా అటుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ మీద వస్తున్న చిరంజీవి, ధర్మారావుతో పాటు ఆటో డ్రైవర్ రాము, ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు శ్రీకాకుళం జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ కేటగిరీలో లావేరు మండలం గోవిందపురం ఎంపీపీ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు, బూర్జ మండల పరిధిలోని ఓవీపేటలో ఉన్న ఏపీమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాసరావు, అధ్యాపక కేటగిరీలో నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్ ఆరంగి అప్పన్న అవార్డులకు ఎంపికయ్యారు. వీరిని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు, ఆర్ఐఓ పి.దుర్గారావు శనివారం అభినందించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు హేయం

శ్రీకాకుళం క్రైమ్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై టీడీపీ కూటమి దాడులు, దౌర్జన్యాలు అత్యంత హేయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇటీవల జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి అరెస్టుల విషయాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి వివరించడానికి శనివారం మధ్యాహ్నం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్సులో ఉండటంతో అదనపు ఎస్పీ (క్రైమ్) పాత్రిని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మీడియాతో మాట్లాడారు.

టీడీపీ ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందని, మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ అమలు చేసి తీరుతామని హామీలు గుప్పించిందని అన్నారు. కానీ ఆచరణలో పెట్టకుండా హామీలను మరిపించడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు పద్ధతుల్లో దాడులకు పూనుకుని సైడ్‌ట్రాక్ పట్టిస్తోందని అన్నారు. ఎవరి మెప్పు కోసం ఈ కేసులు బనాయిస్తున్నారో తెలుసని, ఎల్లకాలం ఈ ప్రభుత్వమే ఉండదన్న విషయాన్ని పోలీసులు గుర్తు చేసుకోవాలన్నారు. ఈ విషయమై తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు వినతిపత్రాలు ఇస్తున్నామని తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపైన కూడా టీడీపీ సోషల్ మీడియా పోస్టుల వేదికగా విమర్శలకు పాల్పడిందని, సాక్ష్యాధారాలు అన్నీ పోలీసులకు సమర్పిస్తామని చెప్పారు. కృష్ణదాస్ వెంట ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, పొన్నాడ రుషి, ఎడ్ల వెంకట్, తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

క్లుప్తంగా

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ అంపైర్‌గా మోహన్‌సాయి


ఎస్.మోహన్‌సాయి

శ్రీకాకుళం న్యూకాలనీ: చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి అంపైర్ పరీక్షలో ఎచ్చెర్ల మండల పరిధిలోని షేర్‌మహ్మద్‌పురం గ్రామానికి చెందిన మోహన్‌సాయి బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి అంపైర్‌గా అర్హత సాధించాడు. థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాడు. ప్రస్తుతం ఉన్న జాతీయ స్థాయి అంపైర్‌లలో మోహన్‌సాయి అత్యంత పిన్న వయస్కుడు. ఇతని తండ్రి సంపతిరావు సూరిబాబు ఇంటర్నేషనల్ రిఫరీగా ఐదేళ్ల క్రితమే అర్హత సాధించారు. మోహన్‌సాయి అర్హత సాధించడం పట్ల ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మచౌదరి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్‌కుమార్, చీఫ్ పేట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈఓ సంపతిరావు సూరిబాబు, గురు గుబెల్లి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

కీర్తిచక్ర అవార్డు గ్రహీతకు సన్మానం


రామ్‌గోపాల్‌నాయుడు దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ నగిరిపెంట గ్రామానికి చెందిన కీర్తి చక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్ల రామ్‌గోపాల్‌నాయుడుకు గ్రామస్తులు శనివారం పౌర సన్మానం చేశారు. మేజరు దంపతులకు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశసేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పేడాడ గోవిందరావు, స్థానికులు ముద్దపు లక్ష్మన, మల్ల రాజు, సనపల లచ్చన్న, చిన్న బాబు తదితరులు ఉన్నారు.

సెంచూరియన్ వర్సిటీలో క్యాంపస్ డ్రైవ్


టాటా ఐటీసీలో ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ప్రొఫెసర్ సాగర్ మైత్రా

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో శనివారం జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో 16 మంది బీఎస్సీ అగ్రికల్చరల్ విద్యార్థులు ఐటీసీ కంపెనీకి ఎంపికైనట్లు డిప్యూటీ రిజిస్ట్రారు(ప్లేస్‌మెంట్) ఎస్.కామేశ్వరరావు తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.4.0 లక్షలుగా టాటా కంపెనీ నిర్ణయించినట్టు తెలియజేశారు. అలాగే విల్సన్ అగ్రిసైన్స్ కంపెనీకి 14 మంది బీఎస్సీ విద్యార్థులు, అక్షయకల్ప ఫారమ్స్ అండ్ ఫుడ్స్ కంపెనీకి 26 మంది ఎంపికైనట్టు అధికారులు ప్రకటించారు. మరో 25 మంది కూడా పలు కంపెనీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు వర్సిటీ ఉపాధ్యక్షులు డీఎన్ రావు, రిజిస్ట్రార్ అనిత పాత్రో, ఉపకులపతి సుప్రియా పట్నాయిక్, ప్రొఫెసర్ సాగర్ మైత్రాలు అభినందించారు.

నేడు జిల్లా స్థాయి పోటీలు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం, శరత్‌చంద్ర అకాడమీ(విజయవాడ), ఇన్‌స్పైరా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇన్‌స్పైరా పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి చిత్రలేఖనం, సోలో స్పెషల్ టాలెంట్(నృత్యం, సంగీతం కాకుండా ఇతర అన్నీ) పోటీలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, దూసి సంతోష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్రలేఖన పోటీలకు అవసరమైన మెటీరియల్‌ను నిర్వాహకులే అందజేస్తారని, 8 నుంచి 15 ఏళ్ల వయసు గల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ అన్నెపు అనంతరావు(70937 74050, 7075755060)ను సంప్రదించాలని కోరారు.

కందిపప్పు సరఫరాలో గోల్‌మాల్!

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురంలో 244 నంబర్ రేషన్ డిపోలో కందిపప్పును చాలామంది కార్డుదారులకు ఇవ్వకుండా కూటమి నాయకులే అమ్ముకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నవంబర్‌కు సంబంధించి కార్డు దారులకు కేజీ చొప్పున ప్రభుత్వం డిపోకు 381 కేజీల కందిపప్పును కేటాయించింది. అయితే వంద కేజీలకు పైగా కందిపప్పును కార్డుదారులకు కాకుండా వ్యాపారులకు అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇక్కడి డిపో డీలరును తొలగించి కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయం శక్తి సంఘానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీనిని స్థానిక కూటమి కార్యకర్తలే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సడగల సాయిరాజ్, కొంక్యాన అనసూయమ్మ, బడ్డి రాజులమ్మ, బడ్డి రమణమ్మ తదితరులు మాట్లాడుతూ తమకు బియ్యం, పంచదారే ఇచ్చారని, కందిపప్పు ఇవ్వలేదని తెలిపారు. కందిపప్పు అడిగితే అయిపోయిందని చెబుతున్నారని వాపోయారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా కందిపప్పు పంపిణీపై ఆరా తీశామని, స్థానిక వీఆర్వోను కూడా ప్రశ్నించామని, పలువురు లబ్ధిదారులు తమకు కందిపప్పు ఇవ్వలేదని వీఆర్వో దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫిషింగ్ హార్బర్.. ఎక్కడి పనులు అక్కడే!

- అటవీ శాఖ అభ్యంతరాలతో ఆగిన పనులు
- పునఃప్రారంభం పేరిట అట్టహాసం చేసేందుకు ప్రభుత్వం యోచన
- జాప్యంపై మత్స్యకారుల ఆందోళన


బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌లో నిలిచిపోయిన పనులు

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో ప్రారంభమైన అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. వివిధ కారణాలు చెప్పి నిర్మాణంలో ఉన్న పనులు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రాంతీయ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల వలసల నిర్మూలనే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు ప్రస్తుతానికి నిలిచిపోయాయి. ఇక్కడి భూములపై అటవీ శాఖ అభ్యంతరాలు తెలిపిందంటూ తాత్కాలికంగా ఎక్కడి పనులు అక్కడే వదిలేయడంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది.

ఇదీ పరిస్థితి..

2023 ఏప్రిల్ 19న భావనపాడు పోర్టు ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. అప్పటి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అప్పటి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ భూమిపూజ చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం పీఎంఎస్‌వై పథకంలో భాగంగా నిర్మాణం చేపడుతున్నారు. రూ.366 కోట్లు మంజూరు చేసి టెండర్లు సైతం పూర్తిచేశారు. విశ్వ సముద్ర కాంట్రాక్ట్ సంస్థ పనులు ప్రారంభించింది. 505 సర్వే నంబర్–18లో 42 ఎకరాలు ప్రభుత్వ స్థలాన్ని ఫిషింగ్ హార్బర్ కోసం కేటాయించారు. రాతి కట్టడాలు, అంతర్గత రోడ్లు, కాంక్రీట్ నిర్మాణాలు వంటి పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల పనులు నిలిపివేశారు. పక్క మండలం రణస్థలం సరిహద్దు భూములు, అటవీ భూములు వంటి సమస్యలు ఉన్నాయంటూ ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పనులు పునఃప్రారంభం పేరుతో అట్టహాసం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. దీంతో నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉంది.

ఎదురుచూపులు ఎన్నాళ్లో..

ఈ హార్బర్ కోసం స్థానికులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. హార్బర్ పూర్తయితే ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని మత్స్యకారులకు ప్రయోజనంగా ఉంటుంది. ఎన్నో సర్వేలు నిర్వహించి మత్స్య సంపద ఎక్కువగా దొరికే ఈ ప్రాంతాన్ని నిర్మాణానికి ఎంచుకున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వేలాది మత్స్యకారులు గుజరాత్ వీరావల్, సూరత్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి వస్తే బుడగుట్లపాలెం, బడివానిపేట, డి.మత్స్యలేశం, అల్లివలస, కొచ్చెర్ల, దోనుపేట వంటి గ్రామాల మత్స్యకారులకు ప్రయోజనకరంగా ఉంటుంది. సురక్షిత చేపల వేట, చేపలు అమ్మకం ద్వారా చాలా మందికి ఉపాధి లభిస్తుంది. ప్రాంతీయ అభివృద్ధి సైతం సాధ్యమవుతుంది.


అసంపూర్తిగా పనులు

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

నిర్మాణం ప్రాంతంలో అటవీ భూములు ఉన్నాయని అటవీ శాఖ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సర్వే జరగడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. కలెక్టర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ స్థలం పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న స్థలంలో పనులు కొనసాగించాలని, అటవీ భూమి విడిచి పెట్టాలని సూచించారు. ఈ మేరకు నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– పి.వి.శ్రీనివాసరావు, జేడీ, జిల్లా మత్స్యశాఖ

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ స్పీకర్ తమ్మినేని


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ జిల్లా పార్లమెంటరీ పరిశీలకుడు తమ్మినేని సీతారాం సతీసమేతంగా శుక్రవారం తాడేపల్లిలో కలిశారు. తనకు శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో పార్టీ స్థితిగతులను తమ్మినేని వివరించారు. కూటమి ప్రభుత్వంలో వివిధ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు తెలిపారు.

తెగుళ్లకు అనుగుణంగా పరిశోధనలు


క్షేత్రస్థాయి పరిశీలనలో శివనారాయణ

ఆమదాలవలస : పంటలను ఆశించే తెగుళ్లకు అనుగుణంగా పరిశోధనలు చేపడితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న విస్తరణ, శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. విస్తరణ కార్యక్రమాలపై శాస్త్రవేత్తలతో చర్చించారు. పంటల్లో గుర్తిస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశోధన స్థానాలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇంట్లో చొరబడి.. పెట్రోల్ పోసి బెదిరించి!

- విశాఖ వ్యక్తులతో కలిసి అలజడి సృష్టించిన చిట్స్ సంస్థ మేనేజర్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


దంపతులను బెదిరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ప్రకాష్‌నగర్‌లో నివాసముంటున్న తమ ఇంటికి స్థానిక చిట్స్ సంస్థ బ్రాంచి మేనేజర్ విశాఖపట్నం జిల్లా వ్యక్తులతో కలిసివచ్చి పెట్రోల్ పోసి బెదిరించారంటూ దంపతులు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కరకవలస రమ 2012 నుంచి నగరంలోని ఓ చిట్స్ కంపెనీలో(బ్రాంచి) ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భర్త సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. భర్త మేనకోడలు వివాహ నిమిత్తం చిట్టీ కట్టే ఆలోచనతో రమ (తాను పని చేసే బ్రాంచిలో కట్టడం కుదరక) నగరంలోనే తమ సంస్థకు చెందిన మరో బ్రాంచికి వెళ్లి అక్కడి మేనేజర్‌ను సంప్రదించింది. అక్కడ కూడా తమ పేరిట చిట్టీ కట్టడం వీలు కాకపోవడంతో తన భర్త స్నేహితుడు కిల్లి గుణశేఖర్ పేరున చిట్టీలు కట్టడం ఆరంభించారు. ఈ క్రమంలో నెలకు రూ. 50 వేలు చొప్పున 50 నెలలు రూ.25 లక్షల చిట్టీ కట్టేందుకు సమాయత్తమై 30 నెలల చిట్టీ (సుమారు రూ.15 లక్షలు) కట్టారు. ఈలోగా డబ్బులు అవసరమై 2023 నుంచే తమకు పాట దక్కించాలని మేనేజర్‌ను ఆశ్రయించారు. అదే ఏడాది మేలో పాట ఇప్పిస్తానని చెప్పినా ఇప్పించలేదు. బాధిత దంపతుల డబ్బుల అవసరాన్ని 'క్యాష్' చేసుకోవాలనే ఉద్దేశంతో బయట రూ. 1.50 వడ్డీకి రూ.7 లక్షలను మేనేజర్ ఇప్పించాడు. నెల నెలా వడ్డీ భారం, ఇంట్లో బాధలు తట్టుకోలేక బాధిత దంపతులు తమకు ఎలాగైనా పాట ఇప్పించమని మళ్లీ ప్రాధేయపడ్డారు. దీనికి మేనేజర్ స్పందిస్తూ అసలు రూ. 7 లక్షలకు అదనంగా మరో రూ. 7 లక్షలు ఇస్తేనే చీటీ ఇప్పిస్తానని, అంతకుముందుగా తన డబ్బులు కట్టాలని డిమాండ్ చేశాడు. లేకపోతే కుమారుడిని కిడ్నాప్ చేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు సత్యనారాయణ ఇంట్లో భోజనం చేస్తుండగా మేనేజర్ విశాఖకు చెందిన తన మనుషులతో చొరబడి హంగామా చేశాడు. సత్యనారాయణ ఒంటిపై పెట్రోల్‌ను పోయడంతో బాధితుడు కేకలు వేయగా స్థానికులు చేరడంతో అక్కడి నుంచి పరారయ్యారు.

ఈ విషయమై రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు ప్రస్తావించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కరెంటు చార్జీలపై మాట మార్చారు


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత విధానాలే అమలు చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. పలాసలో శనివారం నిర్వహించిన శ్రీకాకుళం 18వ మహాసభ సందర్భంగా పలాసలో ర్యాలీ, అనంతరం కాశీబుగ్గ సంతమైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కరెంట్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు ఇంధన, సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్‌పై రూ.1.50 వరకు పెంచి ప్రజలపై తీవ్రభారం మోపారని అన్నారు. స్మార్ట్ మీటర్లతో మరింత భారం మోపేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీవ్ర నష్టమని ఎన్నికల ముందు చెప్పిన లోకేష్ ఇప్పుడు అవే విధానాలు అమలు చేస్తే ఎవరికి ఎలా వాత పెట్టాలో ప్రజలకు బాగా తెలుసునని ఆయన అన్నారు. మోదీది ధృతరాష్ట్ర కౌగిలి అని ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న అన్నా డీఎంకే, బీఆర్ఎస్, శివసేన నాశనమయ్యాయని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ ఉద్దానం రైతులు పండించే జీడి పిక్కలకు గిట్టుబాటు ధర రాకపోవడానికి మోడీ అనుసరించిన దుర్మార్గమైన విధానాలే కారణమన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

'మండలి' దృష్టికి జిల్లా సమస్యలు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


నర్తు రామారావు
ఎమ్మెల్సీ

కవిటి : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శాసన మండలిలో నిలదీస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శనివారం కొత్తపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. సోమవారం నుంచి జరగనున్న శాసనమండలి శీతాకాల సమావేశాలకు హాజరవుతున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో నిర్వహించిన పలు పథకాలను కొనసాగిస్తూ, అదనంగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు మాసాల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే, హామీల నుంచి వారు తప్పించుకునే ధోరణికి అద్దం పడుతోందన్నారు. అన్నదాతా సుఖీభవ, తల్లికివందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు అందక అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల అమలులో మార్పులు ఉండకూడదని ఎమ్మెల్సీ సూచించారు. చట్టసభలో తనకు మాట్లాడే అవకాశం వస్తే జిల్లా, నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. ముఖ్యంగా వంశధార నదీ జలాలు శివారు నియోజకవర్గాలకు అందజేయడం, బాహుదా నదికి అనుసంధానం, పరిశ్రమల ఏర్పాటు, పర్యాటక అభివృద్ధి, మత్స్యకారులకు శీతల గిడ్డంగులు, ఫిషింగ్ జెట్టీల ఏర్పాటు, బెంతొరియాల కుల ధ్రువీకరణ వంటి సమస్యలను మండలి ఛైర్మన్ మోషేన్ రాజు సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రామారావు తెలిపారు.

అణు ప్రహరీ పనులు అడ్డగింత


పనులు అడ్డుకున్న కోటపాలెం రెవెన్యూ గ్రామస్తులు

రణస్థలం : కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం ప్రహరీ నిర్మాణ పనులను కోటపాలెం రెవెన్యూ గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. డీ పట్టా భూములకు సంబంధించి అందరికీ పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని తేల్చిచెప్పారు. దీంతో అణు విద్యుత్ అధికారులు జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పరిహారం చెల్లించాకే పనులు చేసుకోవాలని కరాఖండిగా చెప్పడంతో పోలీసులు వెనుతిరిగారు.

102 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సిబ్బంది

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లిలో బెల్టుషాపు నిర్వహణకు వేలం నిర్వహించడంలో ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి టెక్కలి ఎక్సైజ్ సిబ్బంది స్పందించారు. శనివారం శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది, టెక్కలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ షేక్‌మీరా సాహెబ్ బృందం పెద్దతామరాపల్లిలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బర్ల కేశవరావు 102 మద్యం బాటిళ్లతో దొరకడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బెల్టుషాపులు నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు పి.సత్యనారాయణమూర్తి, పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 2500 కోర్సుల పూర్తి


శాస్త్రి దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

- రికార్డుల శాస్త్రికి సత్కారం

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం కల్చరల్: రెండేళ్లపాటు నిరంతరాయంగా చదువుతూ ఆన్‌లైన్‌లో ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న 2,500 కోర్సులను పూర్తి చేసి నాలుగు ప్రపంచ రికార్డులు సాధించిన ఎంవీఎస్ఎస్ శాస్త్రి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ హోటల్లో శనివారం శాస్త్రి దంపతులను సత్కరించారు.

ఈ సందర్భంగా నగర ప్రముఖులు సురంగి మోహన్‌రావు, బరాటం లక్ష్మణరావు, ఎం.ప్రసాదరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, కొంక్యాన వేణుగోపాల్, జామి భీమశంకర్, మహిబుల్లాఖాన్, ఎం.ఎస్.ఎస్.గుప్తా తదితరులు మాట్లాడుతూ లోక్‌సత్తా సంస్థ నుంచి గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం నిర్మాణం వరకు శాస్త్రి ప్రస్థానంలో నిరంతర శ్రమ, అంకితభావం, పట్టుదల కనిపిస్తాయన్నారు. 2,500 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి ప్రఖ్యాత సంస్థలు, యూనివర్శిటీల నుంచి ధ్రువపత్రాలు పొందడం సామాన్య విషయం కాదన్నారు. చదువుకు వయస్సుతో సంబంధం లేదని నిరూపించారన్నారు. అనంతరం శాస్త్రి మాట్లాడుతూ స్నేహితులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు నటుకుల మోహన్, కొంక్యాన మురళీధర్, గుత్తు చిన్నారావు, పొన్నాడ రవికుమార్, టెక్కం రాంగోపాల్, బహదూర్ భాషా, తర్లాడ అప్పలనాయుడు, శంభాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

కాశీబుగ్గ: మందస మండలం ఛత్రపురం సమీపంలో పశువులు మేపుతున్న బచ్చల సాయమ్మ అనే మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును చైన్‌స్నాచర్స్ తెంచుకుపోయారు. మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి తెంచేసి పారిపోవడంతో బాధితురాలు మందస పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్‌గేమ్స్ స్టేట్‌మీట్ ప్రారంభం

- బాస్కెట్‌బాల్, మోడర్న్ పెంటాథ్లెన్ విభాగాల్లో హోరాహోరీగా పోరు
- రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులు


ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌ను వీక్షిస్తున్న యువత


నెల్లూరు–వైఎస్సార్ కడప క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీఈటీ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరిగే 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) స్కూల్‌గేమ్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ (అండర్–19), మోడర్న్ పెంటాథ్లెన్ (అండర్–17,19) చాంపియన్‌షిప్–2024 పోటీలు శనివారం ప్రారంభయ్యాయి. శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్–19 బాలబాలికలకు బాస్కెట్‌బాల్ పోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కొనసాగుతున్నాయి. స్థానిక కోడిరామ్మూర్తి క్రీడామైదానం, శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా అండర్–17, 19 బాలబాలికలకు మోడర్న్ పెంటాథ్లెన్ పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులకు జిల్లా ఎస్‌జీఎఫ్ అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నారు. డీఈఓ, ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నేతృత్వంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ జిల్లా నాయకులు మొజ్జాడ వెంకటరమణ, మెంటాడ సాంబమూర్తి, సంపతిరావు సూరిబాబు, నిర్మల్ కృష్ణ, బాస్కెట్‌బాల్ డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, రిఫరీలు ఆయా సంఘ ప్రతినిధులు, పీడీలు సమీక్షిస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చేతులమీదుగా లాంఛనంగా ఈ పోటీలు ప్రారంభంకానున్నాయి.

హోరాహోరీగా పోరు..

పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగుతున్నాయి. మోడర్న్ పెంటాథ్లెన్ వ్యక్తిగత ఈవెంట్స్ కావడంతో పలు జిల్లాల క్రీడాకారులు సత్తాచాటుతున్నారు. లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న బాస్కెట్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం, గుంటూరు, చిత్తూరు, కృష్ణ, ప్రకాశం, ఉభయగోదావరి, విశాఖపట్నం జిల్లా లు ముందుంజలో ఉన్నాయి. శ్రీకాకుళం బాలికల జట్టు క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. రాత్రి 11 వరకు మ్యాచ్‌లు కొనసాగాయి. పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున యువత, క్రీడాకారులకు హాజరవుతున్నారు.